# కర్మలు ఎట్టివో ఫలితములు అట్టివిగా ఉంటాయి

చెడ్డపని చేసి మంచిని చెందబోరు
మంచి పని చేసి కీడును గాంచబోరు
నిమ్మమును నాటి చూతఫలంబు గనున
నిమ్మఫలంబును గనున చూతఫలంబునాటి.

విద్యార్థులారా!

మనము భూమిలో ఏ విత్తనము నాటిన అదే మొక్కగా మారి అదే వృక్షముగా మారి ఆ ఫలములనే మనకందిస్తుంది. ఇది ప్రకృతియొక్క స్వభావము. సృష్టియొక్క రహస్యము. ఎవరు కాదన్నను, అవునన్నను ఈ సత్యము మారదు. కనుకనే మానవుడు చేసే ప్రతి కర్మకు ఫలితము ఉంది. ఎట్టి కర్మయో అట్టి ఫలితము. ఎట్టి విత్తనమో అట్టి మొక్క. విత్తనము ఒకటి అయితే మొక్క మరొకటి మొలవదు.

**మానవుడు ఆచరించే కర్మలను బట్టి ఫలితము ఉంటుంది**

కనుకనే మానవుడు ఎట్టి కర్మలాచరించునో అట్టి ఫలములు అందుకో గలుగుతాడు. ప్రతి మానవుడుకూడ మంచి పనులు చేసి మంచి ఫలితము పొందటానికి ప్రయత్నించాలి. కానీ ఈనాటి మానవుడు పుణ్యఫలము కావాలని అమితంగా ఆశిస్తున్నాడు. కాని పుణ్యకర్మలాచరించటానికి ముందంజ వేయటం లేదు. పాప ఫలము విస్మరిస్తున్నాడు. కానీ పాప కర్మలు చేయుటకు ముందంజ వేస్తున్నాడు. ఇది మానవునకున్న అజ్ఞానము. ఇది కేవలం ఒక మానవప్రభావమే కాదు. ప్రకృతి యొక్క ప్రభావంకూడా ఇందులో ప్రసరించి తద్వారా మానవుని అనేక విధములుగా నడిపిస్తోంది. అనుభవించే బాధలను, కష్టములను, దుఃఖములను పంచుకొనలేక "ఓ భగవంతుడా! ఎందుకు నన్నిలా పరిశీలిస్తున్నావు, పరిశోధిస్తున్నావు", అని భగవంతునికి మొరపెట్టుకుంటారు. భగవంతుడు సుఖమును గానీ,

srisathyasai vahini vachanamrutam

దుఃఖములుగాని అందించటం లేదు. నీవు అనుభవించే సుఖ దుఃఖములు నీ కర్మలయొక్క ఫలితములేగానీ భగవంతుని ప్రసాదములు కావు. భగవంతుడు సాక్షీభూతుడు. భగవంతుడు కేవలం ఒక పోస్టుమేన్ వంటివాడు. నీకు ఏ కవరు వస్తే ఆ కవరు నీకందిస్తాడు. ఏ కార్డు వస్తే అది అందిస్తాడు. మనియార్డరు వస్తే అందిస్తాడు. కానీ, ఆ కవరు చించుకొని అందులో ఉండే సుఖదుఃఖాలు పొందేది నీవే కానీ పోస్ట్‌మెన్ కాదు. అదే విధముగా నీవాచరించిన మంచి చెడ్డల ఫలితములు నీవు అనుభవిస్తున్నావు గానీ భగవంతుడు అనుభవింపచేసేవి, భగవంతుడు అందించేవి కాదు. అయితే ఇక్కడ ఒక special grace అనేది ఉంది. నీవు హృదయపూర్వకంగా, పవిత్రమైన భావముతో, నిర్మలమైన హృదయముతో, నిస్వార్థమైన క్రియలతో భగవంతుని స్మరించినప్పుడు భగవంతుడు ప్రత్యేకముగా ఇందులో పాల్గొని నీకు తగిన సహాయము చేస్తుంటాడు. అయితే మానవుని సుఖ, దుఃఖములకు కొంత మూలాధారం ఉంది. ఏ జన్మలోకానీ, ఏపరిస్థితిలో గానీ భక్తులాచరించిన మంచి, చెడ్డల ఫలితమును దృష్టియందుంచుకొని భగవంతుడు దానికి తగిన ఫలితము ప్రసాదిస్తూ ఉంటాడు.

**భగవంతుడు భక్తులను పరీక్షించి ఉత్తీర్ణులైనవారిని అనుగ్రహిస్తాడు**

ద్రౌపదిని దుర్యోధనుడు అనేక అవస్థలకు గురిచేసి నిండుసభలో అవమానించటానికి పూనుకున్నాడు. అప్పుడు ద్రౌపదికి ఏమి సహాయము చేయాలి? కేశవా మాధవా మధుసూధనా అని ప్రార్థన చేసింది. ఈ కేశవుడెవరు? క-అ-ఈశ. కేశవ. క-బ్రహ్మ అ-విష్ణు. ఈశ-ఈశ్వరుడు. ఈ బ్రహ్మ విష్ణుమహేశ్వర స్వరూపాన్ని ఎవరైతే తనయందుంచుకున్నాడో అతనే కేశవుడు. త్రిమూర్తి స్వరూపుడైన ఓ కేశవా! పరాశరుడు దీనిని మరొక రీతిలో వర్ణిస్తూ వచ్చాడు. కేశవ అనగా ఉంగరములతో చుట్టుకొనిన దట్టమైన ముంగురులు కల్గినవాడు. ఇతనెవరు? ఇతనే బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపుడు. ప్రార్థించింది. కృష్ణుడు విన్నాడు. ఈ ప్రార్థన నేను ఏరీతిగా స్వీకరించాలి? ఈ ప్రార్థనకు సంబంధించిన క్రియలేమైనా పూర్వము ద్రౌపది చేసిందా అని ద్రౌపది హిస్టరీ అంతా వెనుకకు తిరిగి చూచాడు. ఒక సంక్రాంతి దినము. ఆనాడు అందరూ చెరకు నములుతూ ఉంటారు. ఆనాడు కృష్ణునితో చేరి ఆనందానుభూతులు పొందుతున్నారు. గోపికలు సత్యభామ, రుక్మిణి, జాంబవతి, ద్రౌపది, వీరినందరిని పరీక్షింపదలచి

sri sathyasai vahanamrutam

కృష్ణుడు కావాలని ఆ చెరకు తీస్తూ వేలును కోసుకుంటాడు. భగవంతుడు భక్తులను పరీక్షించటం అతని స్వభావము. కాని ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని తాను అనుగ్రహిస్తూ ఉంటాడు. చిన్నక్లాసులో ప్రైమరీ స్కూలులో 1st standard లో పోవాలంటే test పెడతారు. ఇది ఏవిధమైన ద్వేషముతోగానీ, వినోదముతో గానీ, అయిష్టముతో గానీ చేసే టెస్టులు కావు. భగవంతుడు అమితప్రేమచేత, దయానుగ్రహము చేత, కరుణచేత వారిని అనుగ్రహింపగోరి వారికి టెస్ట్ ఇస్తుంటాడు. తన వేలు నుండి రక్తము వచ్చింది. సత్యభామ చూచింది. రుక్మిణి చూచింది. జాంబవతి చూచింది. ద్రౌపది చూచింది. వీరందరు ఎంతో near and dear గా ఉండేవారు. దాసీలంతా దూరముగా ఉన్నారు. సత్యభామ చూచింది దాసీని పిలిచి గుడ్డతీసుకురా చుట్టటానికని అంది. రుక్మిణి స్వయంగానే పరుగెత్తి వెళ్లింది లోపలకు. ద్రౌపది చూచింది. తాను కట్టుకున్న చీరకొంగు తీసి చించింది. కట్టుకట్టింది. కుడిచేతి వేలు తెగింది. దీనికి గుడ్డ చుట్టినది ద్రౌపది. ఇది చూచిన తక్షణమే సత్యభామ, రుక్మిణి ఒకరినొకరు ముఖం చూచుకున్నారు. "ద్రౌపదికున్న జాగ్రత్త మనకు లేకపోయిందికదా! ద్రౌపదియొక్క ప్రేమ మనలో లేకపోయింది కదా! మనం కేవలం శరీరమును మాత్రమే కోరుతున్నాము. అతని పరిస్థితి ప్రభావాలేమాత్రం మనం ఆశించటంలేదు. ఇది ద్రౌపదియొక్క భక్తి, ప్రపత్తుల ప్రభావము", అని వారిలో వారు సిగ్గుపడ్డారు. ఇదంతా చూశాడు కృష్ణుడు. ఆనాడు ద్రౌపది ఈవిధంగా నాకు సేవచేసింది కనుక దీనికి నేను ప్రతిఫలంగా అందించాలి అనుకున్నాడు. ఎప్పుడైనా ఈ ప్రాకృతమైన జగత్తులో ఏదైనా వస్తువును మనం పొందాలనుకున్నప్పుడు ఒక వస్తువు నందించి మరొక వస్తువునందుకోవాలి. ఒక షాపుకి వెళ్ళి ఒక చేతిరుమాలు కావాలంటే పదిరూపాయలు అతని కందిస్తే ఒక రుమాలు నీకిస్తాడు. అదే పద్ధతి భక్తునికి, భగవంతునికి మధ్యనున్న సంబంధబాంధవ్యము.

**కించిత్తైనా భగవదర్పితము చేసినప్పుడు అనంతమైన ఫలితమును భగవంతుడు అందిస్తాడు**

నీవు కించిత్తైనా భగవంతునికి అర్పిస్తే అనంతమైన ఫలితాన్ని భగవంతుడు నీకు అందిస్తాడు. కుచేలుడు పిడికెడు అటుకులు అందించగనే బహుళ భాగ్యాన్ని అందించాడు. సత్యభామ కృష్ణుని అమ్మిన సమయంలో రుక్మిణి ఒక తులసిదళము తెచ్చింది, ప్రార్థిస్తూ:

sri sathyasai vachanamrutam

**పత్రమో పుష్పమో ఫలమో తోయమో**
**భక్తి కలిగిన వానికి వశుడవగుట**
**సత్యమేని నీవు ఈ తులసిదళమునకు తూగుదువుగాక.**

పత్రమో! ఏమిటి ఈ పత్రము? శ్రీ గుణములతో కూడిన పత్రము. మారేడు పత్రము, ఈ దేహము. సత్త్వరజో తమోగుణములతో కూడిన దేహమే ఒక పత్రము. పుష్పము, హృదయ పుష్పము. నిర్మలమైన హృదయ పుష్పము. పవిత్రమైన సుగంధముతో కూడిన హృదయ పుష్పము. ఫలమో, మానసిక ఫలము. ఈ మానసిక ఫలమందు మధురమైన రసముంటుంది. కానీ, మధుర రసతత్త్వము మనస్సు ఎరుగదు. ఫలములోని రసము చెట్టు ఎరుగదు. పూవులోని మకరందము తీగలు అనుభవించవు. పవిత్రమైన గ్రంథములలోని మధురరసము ఈ ప్రాకృతమైన మానవులనుభవించలేరు కనుకనే రుక్మిణి ఆ పత్రమర్పితము చేసింది. ఈ తులసీ దళము అర్పితము చేయటంచేత బ్రహ్మాండ నాయకుడైన భగవంతుడు తూగగలిగాడు. ఎట్టి ఆపేక్షలు లేక నిరపేక్షాభావముతో రుక్మిణి కృష్ణుని చూస్తూ వచ్చింది. అదేవిధంగా ద్రౌపది ఎటువంటి ఆపేక్ష లేక నిరపేక్షతో కృష్ణుని కీవిధమైన త్యాగం చేసింది. 'కేశవా మాధవా దేవా మధుసూధనా!' అని ప్రార్థించింది కన్నులు మూసుకొని. గొప్ప బలవంతులైన పతులు దగ్గరనే ఉంటున్నారు. మహావీరులు, శూరులు ఎవరూ ఈమెను రక్షించలేకపోయారు. ఒక్క కృష్ణుడు తప్ప మరొకరు నాకు దిక్కులేరు అని ప్రార్థించింది. తాను చేసిన పూర్వత్యాగమును తన వేలును చుట్టాడు. ఆ వేలుకు కట్టిన చిన్న గుడ్డ అక్షయంగా మారిపోయింది. కనుక కించిత్తైనా మనము భగవంతునికి చేసినప్పుడే అనంతముగా మనం భగవంతుని దగ్గరనుండి అందుకోటానికి వీలవుతుంది.

**దైవానుగ్రహముచేత ఎటువంటి కర్మఫలమునైనా తప్పించుకోవచ్చు**

కర్మఫలము మనకు తప్పునదికాదు. అయితే, దైవానుగ్రహముచేత ఎలాంటి కర్మఫలమునైనా తప్పించుకోవచ్చు. అయితే దైవశాసనములో తప్పించుకొనుటకు వీలుకాదని మాత్రమే ఉంది. ఎట్టి కర్మయో అట్టి ఫలితము నీవు అనుభవించాలి.

sri sathyasai vachanamrutam

కర్మదాట వశమా నరుడా కర్మదాటవశమా ॥కర్మ॥
ఘనపాఠంబులు చదివినగానీ
కుల దేవతలను కొలచినగానీ
కారడవులకే పోయినగానీ
కఠిన తపస్సులే చేసినగానీ ॥కర్మ॥
చిన్న చెలమలో మునిచినగానీ
సప్త సముద్రములలో మునిచినగానీ
పాత్రెంతో నీరంతేరా
కావాలన్నను ఎక్కువరాదుర ॥కర్మ॥

ఎంత పాత్రయో అంత నీరే చిక్కుతుంది. అయితే ఈపాత్ర అధికము చేయటమనేది భగవంతుని Special grace. అది లేక ఏమాత్రము ఫలితము పొందలేము.

భుజబలంబు మరియు బుద్ధిబలంబుండి
దైవబలములేక దీనుడయ్యె
కర్ణుడంతటి వాడు కడపటికేమయ్యె
మరువబోకుడిట్టి మంచి మాట.

భుజబలముంది. బుద్ధి బలముంది. అస్త్రశస్త్ర బలములంతా ఉంటున్నాయి, కర్ణునకు. కానీ, దైవబలము లేదు. కారణము ఏమిటి? దుస్సంగముచేత దుర్భావములు పెంచుకొని దుష్ట చతుష్టయములో ఒకడుగా మారిపోయాడు కర్ణుడు. దుర్యోధన, దుశ్శాసన, శకుని వీరితో కూడటం చేత కర్ణుడు దుష్టుడుగా మారిపోయాడు. కనుక, మనము చెడ్డసంఘములో చేరరాదు. చెడ్డ సంఘములో చేరినప్పుడు చెడ్డ భావములే మనలో ఆవిర్భవిస్తాయి. చెడ్డ భావములు ఆవిర్భవించినప్పుడు చెడ్డ పనులలో మనం ప్రవేశిస్తాము. కనుక కంపెనీ చాలా ప్రధానమైనది. కర్ణుడు చాలా ధర్మపరుడు. కర్ణుని స్వభావము మరింత విచారించాలి. కర్ణుడు యుద్ధభూమిలో కూలిపోయాడు. కర్ణుని ప్రభావము అర్జునునకు బోధించాలని కృష్ణుడు సంకల్పించుకున్నాడు.

sri sathyasai vachanamrutam

కారణం ఏమిటి? అర్జునుడు అహంకారములో ఉంటున్నాడు. నాకంటె గొప్ప అస్త్రశస్త్ర విద్యలు నేర్చినవారు ఈ జగత్తులో లేడనుకున్నాడు. కృష్ణుడు నా ప్రియమిత్రుడు, నా బావమరిది. నా ఇష్టము నెరవేర్చేవాడు అని గర్వము పెంచుకున్నాడు. ఆ గర్వము తీయని మార్గములో అణగదొక్కే నిమిత్తమై కృష్ణుడు అర్జునుని వెంటబెట్టుకున్నాడు. కృష్ణుడు బ్రాహ్మణ వేషము ధరించాడు. కర్ణుడు క్రిందపడి చాలా అవస్థలకు గురౌతున్నాడు. దగ్గరకు వెళ్లి "కర్ణా! నీవు దానకర్ణుడవు. నాఇంటిలో ఒక కార్యము సంకల్పించుకున్నాను. ఈ పరిస్థితిలో నిన్ను అడగటం న్యాయంకాదు. కానీ ధర్మాన్ని కోరి వచ్చాను" అని చెప్పాడు. అప్పుడుకూడా క్రిందపడిన కర్ణుడు 'ఏమికావాలో కోరుకో'మన్నాడు. నాకు కించిత్ బంగారము కావాలన్నాడు. 'బ్రాహ్మణా! నాఇంటికి వెళ్ళి నాభార్యకు నేను చెప్పినట్లు చెప్పు. నాభార్య ఇస్తుంది బంగారం' అన్నాడు. 'నేనీ వ్యాపార నిమిత్తమై రాలేదు. నేరుగా నిన్ను అడిగే నిమిత్తమే వచ్చాను. నీవు ఇస్తే ఇవ్వు అంతేగానీ నీ భార్యను, అత్తను, మామను అడగమని చెప్పవద్దు' అన్నాడు, కృష్ణుడు. కన్నులు మూసుకున్నాడు కర్ణుడు. యుద్ధభూమిలో తన దగ్గర బంగారం ఎక్కడుంది? రెండు పండ్లకు బంగారు తొడుగు వేసుకున్నాడు. పూర్వకాలములో ఇది సహజమే. పళ్లకు రంధ్రము పడినప్పుడు పండ్లను బంగారుతో మూసివేస్తారు. కర్ణుడు 'బ్రాహ్మణా ఈ రెండు పండ్లు తీసుకుపో' అన్నాడు. అప్పుడు కృష్ణుడు "ఏమిటి? ఇది. నీ పండ్లు నేను తీయాలంటే సాధ్యమవుతుందా! నిన్ను హింసించి నేను పండ్లు తీసుకోవాలి. ఇది దానము ఎట్లా అవుతుంది? దానము కాదు. నేను నీ పండ్లను ముట్టను" అన్నాడు. అయితే రెండు రాళ్లు తీసుకు రమ్మన్నాడు. రెండు రాళ్లు తీసుకువచ్చియిస్తే రాళ్ళతో రెండు పండ్లు కొట్టితీసి ఇచ్చాడు. 'రక్తమయమైన సువర్ణము నేనెట్లా ముట్టేది?' ఇంకా పరీక్షలు చేస్తున్నాడు. 'నీవు క్షత్రియుడవు. నీ ఎంగిలి నేను ఏవిధంగా ముట్టాలి. ఇది నా ఆచారమునకు విరుద్ధము' అన్నాడు. తక్షణమే అంబును తీసుకొని భూమిలో గట్టిగా వేశాడు. ఆ గంగ పైకి ఉబికి వచ్చింది. తక్షణమే ఆ పండ్లను గంగలో కడిగి కుడిచేత్తో ఇచ్చాడు. కృష్ణుడు అర్జునునివైపు చూచాడు. అర్జునుడు శిరస్సు వంచుకున్నాడు. 'ఈ విధమైన త్యాగము, ఈ విధమైన దైవభక్తి, ఈ విధమైన స్వభావము నేను ఎక్కడా చూడలేదు. ఇట్టి భక్తి ప్రపత్తులు నాలో ఏమూలను కనిపించవు కృష్ణా నన్ను క్షమించు' అన్నాడు. అప్పుడు చెప్పాడు కృష్ణుడు; 'ఈ కర్ణుడు ఎవరో తెలుసునా. నీ పెద్దన్న ధర్మరాజు కంటె ముందు పుట్టాడు కర్ణుడు'. చాలా

srisathyasaivachanamrutam

బాధపడ్డాడు. 'ఈ మాట ముందుగా ఎందుకు చెప్పలేదు. నా స్వంత అన్నను అనేక విధములుగా బాధించాను' అని వాపోయాడు. ధర్మజుని కంటె గొప్పవాడు కర్ణుడు.

**దైవచింతనచేత దేహాభిమానమును తగ్గించుకుంటూ రావాలి**

ఈ విధముగా భగవంతునికి ఏదైనా ఇవ్వటానికి సంసిద్ధముగా ఉండే పరిస్థితి ఆనాటి ధర్మము. ప్రతి కర్మకు ఒక ఫలితముంటుంది. ప్రతి కర్మ ఒక విత్తనమే. ప్రతి విత్తనము ఒక చెట్టే. ప్రతి చెట్టునందు ఫలములు వస్తాయి. అట్టి ఫలములనే వృక్షము అందిస్తుంది. కనుక మనము పవిత్రమైన కర్మలాచరించటానికి పూనుకోవాలి. కర్మలు ఎట్టివో ఫలితములు అట్టివిగా ఉంటాయి. కానీ చేసే సమయంలో ఆనందముగా చేస్తుంటాము. కానీ అనుభవించేటప్పుడు కంటి ధారలతో అనుభవిస్తాము. మొదటే మనము గుర్తించి ఏ కర్మలు మంచివి ఏ కర్మలు చెడ్డవి అని నిర్ణయము చేసికొని మంచి కర్మలలో మనం ప్రవేశించాలి. ఈనాడు ప్రకృతి ప్రభావము ముందు వెనుకలు యోచించకుండా కర్మలాచరిస్తాము. ముందు వెనుక విచారించక మాటలు చెబుతాము. కడపటికి ఫలితము వచ్చేటప్పటికి కృంగిపోతాము. ప్రపంచములో ప్రతి చర్య ప్రాకృతమైన చర్యయే. వర్షము కురిసింది. ఒకనికోసం కురిసిందా? కాదు. ప్రకృతిలోని ప్రతి మానవునికోసం వర్షం కురిసింది. అందరికి చల్లదనము నందిస్తుంది. అందరికి దాహము తీరుస్తుంది. మలయ మారుతము వీస్తుంది. ఇది ఒక్క మానవునికోసం కాదు. అన్ని ప్రాణులకు పంచభూతములు ప్రాకృత జీవులను రక్షించే కోసము వచ్చినవే. ఏ ఒక్కరి కోసము వచ్చినది కాదు. అదే విధముగా దైవము కూడా ఒక జాతికోసము, ఒక దేశము కోసము, ఒక వ్యక్తి కోసము వచ్చినది కాదు. విశ్వమును ఉద్ధరించటము కోసము వచ్చినది. ఎవరు ఎట్టి కర్మలాచరింతురో అట్టి ఫలితము నందిస్తాడు.

మనము కర్మలాచరించుటకు పూర్వము కొంతకాలము తీసుకొని విచారించి మంచి కార్యములు చేయాలి. ఈ కర్మలవల్ల ఎవరికి ఏవిధమైన కష్టము, నష్టము, కలగకుండా చూచుకోవాలి. అయితే జగత్తునందు ఇది అసాధ్యము. మానవత్వమనే అభిమానము పుచ్చుకొని తదుపరి కర్మలాచరించాలంటే ఏనాటికి సాధ్యము కాదు. దేహాభిమానము మరచిన వ్యక్తిమాత్రమే ఈ కార్యము చేయగలడు. ప్రకృతిని బట్టే మనకు దుఃఖము ప్రాప్తిస్తున్నది. ఈ ప్రకృతి మన

sri sathyasai vahini amrutam

దృష్టినిబట్టే వస్తుంది. దేహాభిమానము ఉండినంతవరకు ప్రకృతి ఉంటుంది. ప్రకృతి భావము ఉండినంతవరకు దుఃఖము వెంటాడుతుంది. ఎప్పుడు దేహాభిమానము పోతుందో అప్పుడు ప్రకృతి కూడా పోతుంది. ఎప్పుడు ప్రకృతి పోతుందో అప్పుడు దుఃఖము కూడా ఉండదు. జాగ్రదవస్థలో దేహాభిమానముంది. ప్రకృతి కనిపిస్తున్నది. సుఖ సంతోషములు మనము అనుభవిస్తున్నాము. సుషుప్తి గాఢనిద్రయందు మన దేహమే మనకు లేదు. మన దేహమే మనకు లేనప్పుడు ప్రకృతి మనకు కనిపించదు. ప్రకృతి లేనప్పుడు మనకు దుఃఖమే లేదు. ఒక్క నిద్రావస్థయందు సుఖదుఃఖములు లేవు. అదే విధముగా దైవచింతన చేత దేహాభిమానమును క్రమముగా తగ్గించుకుంటూ రావాలి. అప్పుడే ప్రాకృతమైన భావములు క్రమక్రమేణా తగ్గిపోతాయి. ప్రాకృతమైన భావములు ఎప్పుడు లేకుండా పోతాయో అప్పుడే మనకు దుఃఖము నివారణ అవుతుంది. దుఃఖములు, సుఖములు మనము పిలుస్తే వచ్చేవికావు. 'కాననంబున కార్చిచ్చు వేములను గాల్చి మామిళ్ళను విడచి చనున' అన్నింటిని కాల్చి వేస్తుంది. మనము దేహాభిమానము ఏనాడు తగ్గించుకుంటామో అప్పుడు సుఖము, దుఃఖము రెండూ ఉండవు.

'కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవుకదా'. అందులకే ఉపనిషత్తులు "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత" అని చెప్పాయి. 'ఓ మానవుడా! నీ అజ్ఞానమనే నిద్రనుంచి మేలుకో. నీ సత్యము నీవు గుర్తించు. కేవలము నీవే సత్యస్వరూపుడవై ఉండి కూడను ఈ సత్యాన్ని గుర్తించుకోలేక తిరిగి సత్యము ఎక్కడో ఉంటున్నదని అన్వేషణ ప్రారంభిస్తున్నావు', అని హెచ్చరిస్తున్నాయి. ఇది ఎక్కడో బయటలేదు. ఆ సచ్చిదానందము నీవే. ఒక కింగ్ ఉంటాడు. ఒక ప్రెసిడెంటు ఉంటాడు, ప్రైమినిష్టరుంటాడు. నిద్రావస్థలో నేను కింగ్‌ను, నేను ప్రెసిడెంటును, నేను ప్రైమినిష్టరును అనే భావములేవీ ఉండవు. కానీ మేలుకొన్న తరువాత నేను కింగ్‌ను, నేను ప్రెసిడెంటును, నేను ప్రైమినిష్టరును అని చెప్పగలుగుతున్నాను. ఈ అజ్ఞానమనే, ప్రాకృత భావమనే నిద్రలో నుండిన వానికి నేను సచ్చిదానంద స్వరూపుడను అని తెలియకుండా ఉంటుంది. నీవు మేలుకో. జ్ఞానమార్గములో నీవు మేలుకో. అప్పుడు సచ్చిదానంద స్వరూపుడవని గుర్తించుకోటానికి వీలవుతుంది. నిద్రలో ఉండినంతవరకు నీవు ఎవరో నీకే తెలియదు. మేలుకున్న తరువాతనే నీ పేరు, నీ రూపము, నీ హోదా అన్ని గుర్తించటానికి

srisathyasaivachanamrutam

వీలవుతుంది. ఈనాడు ఎలా ఉంటున్నాము? ప్రాకృతమైన నిద్రలో ఉంటున్నాము. భౌతికమైన నిద్రలో ఉంటున్నాము. లౌకికమైన నిద్రలో ఉంటున్నాము. అజ్ఞానమనే నిద్రలో ఉంటున్నాము. కనుకనే మన సచ్చిదానంద స్వరూపమును గుర్తించుకోలేక పోతున్నాము. నిద్రలో నీకు పాము కరచింది. నిద్రలో కరచిన పాముకోసం అరుస్తున్నావు. నిద్రలో పాము కరచినందుకు ప్రత్యక్షముగా పోయి మందువేస్తే నివారణ అవుతుందా? నిద్రనుండి లేపుతే పాము కరచిన బాధ తగ్గిపోతుంది. నిద్రలో నుండినంతవరకు పాము భయము బాధిస్తుంది. నిద్ర లేపుతే పాము భయము ఉండదు. కరచిన గుర్తులుండవు. ఈనాడు అజ్ఞానమనే నిద్రలో ఉంటున్నాము. దేహాభిమానమనే నిద్రలో ఉంటున్నాము. లోకాభిమానమనే నిద్రలో ఉంటున్నాము. అనిత్యం అసుఖం లోకం. ఇది ఒక నిద్రవంటిది. నిద్రలో బాధలు అనుభవిస్తున్నాము. దీనికి ఔషధము ఏమిటి? పరిహారము ఏమిటి? అజ్ఞానమనే నిద్రనుండి మేలుకోటమే. ఇవన్నీ దేహాభిమానముతో కలసి వస్తున్నాయి.

**ఆత్మవిశ్వాసము ఒక్కటుంటే సర్వము సాధించవచ్చు**

క్రమక్రమేణా దేహాభిమానమును తగ్గించుకుంటూ రావాలి. అప్పుడే మనకానందము పెరుగుతూ వస్తుంది. ఎంత అభిమానము తగ్గించుకొందువో అంత ఆనందము లభ్యమవుతుంది. ఆనందమును అనుభవించగోరే ప్రతివ్యక్తి ఈ అభిమానమును తగ్గించుకుంటూ రావాలి. అభిమానమునకు తోడుగా అహంకారము ప్రారంభమవుతుంది. పదవులచేతనో లేక ధనముచేతనో లేక భుజబలముచేతనో, జన బలముచేతనో ఏదో ఒక విధంగా అహంకారము మనలో ఆవిర్భవిస్తుంది. మనం ఎంత పెరుగుతూ పోతే అంత అభిమానము, అహంకారము తరుగుతూ రావాలి. మేఘములలో నీరు నిండినప్పుడు భారమై క్రిందికి దిగుతాయి. ఒక చెట్టుకు అమితంగా కాయలు కాచినప్పుడు కొమ్మలంతా వంగిపోతాయి. అయితే ఈనాటి మానవుడు దేనిపై ఆధారపడి ఉన్నాడు? చక్కగా విచారించి చూస్తే చిన్న పక్షి కొమ్మపై వాలి ఉంది. కొమ్మ అటూ ఇటూ ఆడినా పక్షి ఏమాత్రము భయపడదు. కారణం ఏమిటి? 'నేను నా రెక్కలనాశ్రయించాను కొమ్మఊగనీ, కాలనీ, కూలనీ నారెక్కలు భద్రంగా ఉంటున్నా'యని రెక్కలపై విశ్వాసముచేత కొమ్మపైన కూర్చోగలుగుచున్నది. కానీ ఈనాడు పక్షికున్న విశ్వాసము మానవునికి లేదు. సంసారమనే వృక్షముపై కూర్చుని బాధలు, కష్టములు కలిగినప్పుడు తాను

sri sathyasai vachanamrutam

భయపడిపోతున్నాడు. కారణం ఏమిటి? ఆత్మవిశ్వాసము కోల్పోవటం. తనపై తనకు విశ్వాసము లేకపోవటమే. పక్షికి తన రెక్కలపై తనకు విశ్వాసముందిగానీ మానవునకు ఆత్మవిశ్వాసము లేకుండా పోతున్నాది. ఏ కించిత్ కష్టమునకైనా కృంగిపోతున్నాడు మానవుడు. కించిత్ బాధలకు కృంగి పోతున్నాడు మానవుడు. దేనిని భరించుకోలేకపోతున్నాడు. సహించుకోలేకపోతున్నాడు. కనుక పక్షులు, మృగములు సహజమైన జీవితము అనుభవించటం చేత అవి ధైర్యముగా, సాహసంగా కార్యాలు సాధిస్తూ పోతున్నాయి.

ఈనాటి మానవుడు తన బుద్ధి బలముపైన, భుజబలముపైన, ధన బలముపైన తాను ఆధారపడి ఉంటున్నాడు. ఆత్మబలము నాశ్రయించుకోలేదు. ఆత్మ విశ్వాసము ఒక్కటి ఉంటే సర్వము సాధించవచ్చు. ఈ ధనబలము వస్తుంది, పోతుంది. జనబలము, ధనబలము ఎంతవరకు? నీవు అధికారముతో సిరిసంపదలతో తులతూగుతున్నంతవరకు బంధువులంతా నీ వెంట ఉంటారు. తదుపరి జగత్తు ఎట్లా గౌరవిస్తుంది? ఆత్మబలము ఒక్కటి ఉంటే సర్వబలములు చేకూరుతాయి. ఈనాడు ఆత్మబలముచేత, దైవబలముచేత జీవించుటకు పూనుకోవాలి. ఆత్మను విశ్వసించి మంచికర్మలు ఆచరించటానికి ప్రయత్నించాలి. కర్మలు ఎట్టివో ఫలితములట్టివి. తిండి ఎట్టిదో త్రేపు అట్టిది. పిండి ఎట్టిదో రొట్టె అట్టిది. ప్రతి మానవుడు సత్కర్మలలో ప్రవేశించి సదానందమును అనుభవించాలి. సత్ లోకములో చేరాలి. ఇదే మానవుని ప్రధాన గమ్యము. ఇదే మానవుల ప్రధాన లక్ష్యము. కేవలం చెడ్డపనిచేసి మంచిరావాలంటే ఇది రావటానికి వీలు కాదు. మంచి చేయండి. దైవత్వమునకు అత్యంత సమీపముగా పోవటానికి కృషి చేయాలి. ఒక్కొక్క అడుగు దైవమునకు సన్నిహితంగా ఉండాలి. మనము వేసే ప్రతి అడుగు దైవమునకు సమీపముగా పోవాలి. అప్పుడే మనము విజయమును సాధించగలము.

1996 జూలై 1వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasaivechanamrutam